నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు
తిరుపతి
సోమవారం 20 అక్టోబర్ 2025










### పూర్ణాహుతితో ముగిసిన
## శ్రీ కల్యాణ వేంకన్న
# పవిత్రోత్సవాలు

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగ శాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత

మిగతా 3లో..



53

# ఈ దారిలో..వెళ్లేదెలా..?



**అధ్వానంగా తయారైన యాలకారి కండ్రిగ రోడ్డు**
**పట్టించుకోని సంబంధిత అధికారులు**

**పెళ్లకూరు, మేజర్ న్యూస్** మండలంలోని చింతపూడి పంచాయతీ యాలకారి కండ్రిగ గ్రామానికి వెళ్లే రోడ్డు బురదమయంగా తయారయింది. దీనితో ఈ మార్గం వెంట వెళ్లే ప్రజలు ద్విచక్ర వాహన సాధకులు నరకయాతన అనుభవిస్తున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో రోడ్డు చిద్రమై బురదమయంగా అడుగులోతు గుంతలు ఏర్పడుతున్నాయి. అడుగు తీసి అడుగు పెట్టలేనంత బురదగా ఉండడంతో ఈ మార్గం వెంట వెళ్లే వారి బాధలు వర్ణనాతీతం. గుంతలు ఏర్పడి బురదమయంగా ఉన్న ఈ రోడ్డుపై ద్విచక్ర వాహన సాధకులు జారిపడి ప్రమాదాలు జరిగిన సంఘటన అనేకం ఉన్నాయి. కనీసం గ్రావెల్ అయినా పరచాలని వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చింతపూడి నుంచి యాలకారి కండ్రిగ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డును సిమెంట్ రోడ్డు గా ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## 25 నుంచి లా పీజీఎల్‌సెట్ సీట్లు కేటాయింపు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ లాసెట్, పీజీఎల్‌సెట్ – 2025 అడ్మిషన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుని వెబ్ ఆప్షన్స్ కు అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 25 నుంచి సీట్లు కేటాయింపు ప్రారంభిస్తున్నట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ సీతాకుమారి తెలిపారు. ఈనెల 21, 22 తేదీలలో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించామని, 23వ తేదీ వెబ్ ఆప్షన్లు మార్చుకునే వెసులుబాటు కల్పించామని తెలిపారు. 25వ తేదీ సీట్లు కేటాయింపు చేపడతామని, 27 నుంచి 29 వరకు కాలేజీలలో ప్రవేశానికి అవకాశం కల్పించామన్నారు. అలాగే 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వెబ్ ఆప్షన్ల ద్వారా సీట్లు కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కొరకు అధికారక వెబ్సైట్ ను సంప్రదించాలని కోరారు.

## కుప్పం జగనన్న కాలనీలో దోచేసిన దొంగలు



**కుప్పం,మేజర్ న్యూస్:** కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. స్థానికంగా ఉంటున్న ఫోటోగ్రాఫర్ సికందర్ బెంగళూరులో బంధువుల వివాహానికి కుటుంబంతో కలిసి వెళ్లారు. ఆదివారం తిరిగి ఇంటికి వచ్చేలోపు దొంగలు అందిన కాడికి దోచేశారు.ఇంటి తలుపులతో పాటు బీరువాలను పగలగొట్టి అందులోని బంగారు, వెండి ఆభరణాలతో పాటు ఇతర వస్తువులను దోచుకెళ్లినట్టు బాధితులు కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.అదే విధంగా ఇల్లు లేనివారికి ప్రభుత్వం కేటాయించిన కాలనీలో జన జీవనాలు లేకపోవడంతో కొంతమంది ఇంటి నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో కొంతమంది అనామకులు మద్యపానం సేవిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు.అలాంటి వారి పై పోలీసులు చర్యలు తీసుకొని రక్షణ కల్పించాలని స్థానిక నివాసులు కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో సమృద్ధిగా వర్షాలు





**చెరువుల్లో జల హారతి ఇచ్చిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్**

**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, చెరువులు నీటితో కళకళలాడుతూ.. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ఆదివారం గుడిపాల మండలంలో జల హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటగా గుడిపాల చెరువులో గంగాదేవికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మకు పసుపు, కుంకుమ, సారె సమర్పించి పూజ చేశారు. గుమ్మడికాయతో హారతి పట్టారు. అనంతరం వసంతాపురం బంగారక్క చెరువులో నిర్వహించిన జల హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. చెరువు నీటిలో పూజలు నిర్వహించి హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని.. అటు సంక్షేమ పథకాలు, ఇటు అభివృద్ధి పనులతో సంతోషంగా ఉన్నారు. వర్షాలు సంవృద్ధిగా కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారతారని, రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, చిత్తూరు తెదేపా పార్లమెంటరీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, ఎమ్మెల్యే తల్లిదండ్రులు రజని, గురజాల చెన్నకేశవులు నాయుడు, తెదేపా మండల ఉపాధ్యక్షులు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు ప్రతాప్ నాయుడు, నాయకులు అనిల్, నాగరాజు యాదవ్, బాలాజీ నాయుడు, హరి, హేమాద్రి నాయుడు, లీలావతి, నరేష్, గుర్రప్ప నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్, ఎస్పీలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన గురజాల ప్రతిమ



**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సతీమణి గురజాల ప్రతిమ ఆదివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సతీమణి, జిల్లా ఎస్పీ తుషార్ డూడి వారి సతీమణి అమూల్య ని మర్యాదపూర్వకంగా కలిశారు. దీపావళి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు అందించారు. ఈ కార్యక్రమంలో గురజాల నీరజ, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాప్యం, అనారోగ్య కారణాల వల్ల టైగర్ సమీర్ మృతి



**చంద్రగిరి, మెజర్ న్యూస్:** వేంకటేశ్వర జియోలాజికల్ పార్క్‌లో వైట్ టైగర్ “సమీర్” మృతి వృద్ధాప్యం అనారోగ్య కారణాల వల్లనే జరిగిందని క్యురేటర్ సెల్వం వెల్లడించారు. 19 ఏళ్ల వయస్సు కలిగిన సమీర్ 2011లో హైదరాబాద్ నెహ్రూ జూ పార్క్ నుంచి తరలించారు. హైడ్రో నెఫ్రోసిస్, వయస్సు సమస్యల వల్ల మరణం అని పోస్ట్‌మార్టమ్ నివేదికలో వెల్లడయ్యిందని క్యురేటర్ సెల్వం వెల్లడించారు.

## పారదర్శకత అంటే ఏమిటి..?

**నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డికి ఘాటుగా కౌంటర్ ఇచ్చిన టిడిపి నేత విజయ శేఖర్‌రెడ్డి**




**వాకాడు, మేజర్‌న్యూస్** వాకాడు గ్రూపు ఆలయాలకు సంబంధించిన దేవుడు మాన్యం భూములకు కౌలు వేలం వేసేందుకు కూటమి ప్రభుత్వం నాయకులు ప్రయత్నం చేస్తుండడంతో దళితులు సాగు చేస్తున్న భూములు వేలంపాటలు నిర్వహించడం అన్యాయం అంటూ వైసీపీ నాయకులు రామ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. వాకాడు గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కు చెందిన భూములు కౌలు వ్యవహారంపై రామ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. రామ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలపై టిడిపి నాయకులు తీవ్రంగా స్పందించారు. విజయ్ శేఖర్ రెడ్డి స్పందిస్తు వాస్తవాలు వక్రీకరిస్తున్నారన్నారు, రామ్ కుమార్ రెడ్డి మనుషులు గతంలో కొందరు దేవస్థానం భూములులో మట్టి విక్రయించి లక్షలాది రూపాయలు సంపాదించారు .ఎమ్మెల్యే కుల మతాలకతీతంగా పనిచేస్తున్నారు. ప్రధానంగా ఆయన దళితుల పక్షపాతి, దేవుళ్లకు కులాలను రుద్దడం విచారకరమన్నారు. దేవస్థానం అభివృద్ధి ఎమ్మెల్యే లక్ష్యం అని మరో టిడిపి నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి అన్నారు.వాకాడు మండలంలో దేవస్థానములు అభివృద్ధికి ఎమ్మెల్యే తన వంతుగా కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే పై నిందలు మోపడం విచారకరం, ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి లక్ష్యంతో ఎమ్మెల్యే పని చేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ నాయకులు ఎండోమెంట్ వ్యవహారంపై టీడీపీ నాయకులు రామ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలకు తీవ్రంగా ఖండించారు.

## కౌండిన్య నదిపై వంతెన నిర్మించడానికి / పలమనేరు ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

**- సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు విజ్ఞప్తి**

**పలమనేరు, మేజర్ న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పలమనేరు పట్టణ నియోజకవర్గ, ముఖ్య సమావేశం సి.చెన్నకేశవులు అధ్యక్షతన జరిగింది.సమావేశం అనంతరం సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు పలమనేరు సిపిఐ పట్టణ కార్యదర్శి బుర్ర మంజునాథ్ బాబు, నాయకులు వి. రమేష్,పి.రఘు లు జల్లి పేట గ్రామానికి వెళ్లే దారిలోని కౌండిన్య నదిని సందర్శించి మూడు గ్రామాల ప్రజలు వెళ్లే రోడ్డు పరిస్థితిని తెలుసుకున్నారు. చిత్తూరు జిల్లా, పలమనేరు నియోజకవర్గం, కుర్మాయి పంచాయతీ జల్లి పేట గ్రామం వెంకటేశ్వరపురం ముడి వారిపల్లె గ్రామానికి వెళ్లాలంటే కౌండిన్య నదిపైనే వెళ్లాలి. వర్షాకాలంలో వర్షం వచ్చినప్పుడల్లా ప్రవాహం వచ్చి రోడ్లన్నీ ప్రవాహం లో కొట్టుకుపోయి గుంతల గుంతలుగా ఏర్పడి మూడు గ్రామాల ప్రజలు దాటుకోవడానికి కూడా చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆ మూడు గ్రామాల్లో సుమారు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నారని వారికి రాకపోకలు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఎవరైనా అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 50 సంవత్సరాలుగా ప్రజలు కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలని మొరపెట్టుకున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు గాని,ప్రభుత్వం అధికారులు గాని పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వంతెన లేకపోవడంతో నదిలో ప్రవాహం వచ్చినప్పుడల్లా ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వంలో అధికారంలో ఉన్న పలమనేరు నియోజకవర్గం శాసనసభ్యులు, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, జోక్యం చేసుకొని కౌండిన్య నదిపై వంతెన నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకొని కూర్మాయి పంచాయతీలోని జల్లిపేట, వెంకటేశ్వరపురం, ముడివారిపల్లె గ్రామ ప్రజలకు సౌకర్యం కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# ప్రతి ఒక్కరికీ దీపావళి శుభాకాంక్షలు

**వెలుగుల పండుగ అయిన దీపావళి మీ జీవితాల్లో ఆనందం, శాంతి, సిరి, సౌభాగ్యం నింపాలని ఆకాంక్షిస్తున్నాను..జిల్లా ఎస్పి యల్.సుబ్బరాయుడు**



**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లా పోలీస్ శాఖ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా దుకాణాలు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో, భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ యల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాలు జారీ చేశారు.జిల్లా ఎస్పీ పేర్కొంటూ అనుమతులు పొందిన బాణాసంచా షాపుల నిర్వాహకులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి. ప్రతి షాపు వద్ద నీటి బిందెలు, మట్టి, ఫైర్ ఎక్స్టింగ్విషర్ వంటి అవసరమైన భద్రతా పరికరాలు సిద్ధంగా ఉంచాలి. అదేవిధంగా ఫైర్ ఇంజన్ సిద్ధంగా ఉంచడం, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో అత్యవసర వైద్య సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టామని" తెలిపారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో రద్దీ నియంత్రణకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయబడిందని, ప్రజలు శాంతియుతంగా మరియు భద్రతగా దీపావళి జరుపుకునేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు. అదేవిధంగా హెచ్చరిస్తూ అనధికారిక బాణాసంచా విక్రయాలు లేదా నిల్వలు ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయి. అటువంటి కార్యకలాపాలు గమనించిన వారు వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించాలి. అనుమతి లేని విక్రయాలు చేసిన వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదు" అని స్పష్టం చేశారు. ప్రజలందరూ దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చేటప్పుడు పిల్లలను పెద్దల పర్యవేక్షణలో ఉంచాలి, రోడ్లపై లేదా గ్యాస్ సిలిండర్ వంటి ప్రమాదకర ప్రదేశాల్లో బాణాసంచా కాల్చరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు. ఈ దీపావళి ప్రతి ఇంటా సురక్షితంగా, ఆనందంగా వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నాను," అని జిల్లా ఎస్పీ యల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ అన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లపై సీఎం స్పందన హర్షణీయం

**ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు**

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** దీపావళి కానుకగా దీపావళికి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వంతో సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి, ఆ సమావేశాన్ని సాధించ గలిగిన ఏపీ జేఏసీ అధ్యక్షులు ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు ఏపీ ఎన్‌జిజి ఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శి రమణకి చిత్తూరు జిల్లా ఉద్యోగ సంఘాల తరపున ఆదివారం స్థానిక ఎన్జీవో హోం లో నిర్వహించిన సమావేశంలో ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షులు రాఘవులు శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తో జరిగిన స్నే హపూర్వక మైన, గౌరవప్రదమైన, హుం దాతన చర్చలు దాదాపు ఐదు సంవత్సరా ల తర్వాత ఈ స్థాయిలో జరగడం చాలా సంతోష దాయకమని ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర మంత్రులకు శుభాకాంక్షలు కృతజ్ఞతలు తెలిపారు.

## నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురండి

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్**



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని అవాస్తవాలను ఎవరో చెప్పారని, తప్పుడు వార్తలకు ప్రాధాన్యత ఇచ్చి నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకాలు సృష్టించవద్దు అని రాష్ట్ర ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వి ఎం థామస్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం చిత్తూరులో ఎమ్మెల్యే థామస్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మీడియా సమావేశం లో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పత్రిక స్వేచ్ఛను అణచివేసే ధోరణి తమ ప్రభుత్వానికి లేదన్నారు. కానీ నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడే కథనాలను, అభివృద్ధిపై ఫోకస్ కథనాలను రాయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో పత్రిక స్వేచ్ఛను అనగదొక్కే ప్రయత్నాలు జరగవన్నారు. వైద్య-సేవ ను రెండు కళ్ళుగా భావించి చేస్తున్నానని, నిరుత్సాహపరిచే విధంగా వార్తలు రాయవద్దన్నారు. సాక్షి దినపత్రికలో కేవలం వైసీపీ వార్తలను భూతద్దం లో చూపిస్తున్నారని, తప్పుడు వార్తలకే ప్రాధాన్యత ఉంటుందని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి పరిశ్రమల హబ్ గా రూపాంతరం చెందే విధంగా చర్యలు తీసుకుంటున్నానని వెల్లడించారు.

## పూర్ణాహుతితో ముగిసిన శ్రీ కల్యాణ వేంకన్న పవిత్రోత్సవాలు

మొదటిపేజీ తరువాయి

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు.సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా కుంభప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ముగిశాయి.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆర్జితం ఇన్స్పెక్టర్ ధనశేఖర్ ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కె.షణ్ముగ ప్రియకు రూ.పదివేలు బహుమతి



**శ్రీకాళహస్తి మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కత్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిఠాయి వేణుగోపాల్ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ నేతృత్వంలో 10000 రూపాయలు చెక్కును అందచేసి అభినందనలు చేయడం జరిగింది. రాబోయే రోజుల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని విధాలుగా సహాయం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్, సూర్య ప్రకాష్, భాను ప్రకాష్, షణ్ముగ, నీలకంఠం, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఫోటో విద్యార్థికి బహుమతిస్తున్న బిజెపి నేతలు

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి మండలం కోదండరామపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు వివరాలు ఎలా ఉన్నాయి. పాకాల మండలం ఎర్రేపల్లికి చెందిన నరేష్ తన తల్లితో కలిసి ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వెళ్తుండగా, ఆ క్రమంలో నరేష్ తల్లి సంపూర్ణమ్మ తన చీర బైక్ వీళ్లకు చుట్టుకోవడంతో ఆమె కింద పడింది.తీవ్ర రక్త కాయల కావడంతో ఆ మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలం చేరుకొని మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


## బాణాసంచా దుకాణంపై ఆకస్మిక దాడులు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని తల్వాయిపాడు గ్రామం సమీపంలో బాణాసంచా విక్రయిస్తున్న దుకాణంపై నాయుడు పేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంఘమేశ్వర్ రావు ఆధ్వర్యంలో మండల అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాణాసంచా దుకాణదారుడు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.షాపుల వద్ద భద్రతా చర్యలను సమీక్షించి నో స్మోకింగ్ నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఫైర్ ఎక్సిసింగ్విషర్ ట్యాగ్ లు తప్పనిసరిగా ఉండాలన్నారు.ఈ ఆకస్మిక తనిఖీ లో మండల తహసీల్దార్ సి.హెచ్ హరికృష్ణ,స్థానిక ఎస్సై కె.నాగరాజు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ సంతోషి బాయి తదితరులు ఉన్నారు.



## చంద్రగిరిలో ట్రాఫిక్ జామ్

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన 108 వాహనం
- చంద్రగిరిలో భారీగా ట్రాఫిక్ జామ్



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** దీపావళి పండుగ నేపథ్యంలో చంద్రగిరి పట్టణం రద్దీగా మారింది. సాయంత్రం టవర్ క్లాక్ కూడలిలో భారీ వాహనాల రద్దీ కారణంగా గంటల కొద్దీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పండుగ కొనుగోళ్లతో పాటు పటాకుల విక్రయ కేంద్రాలకు ప్రజలు భారీగా తరలివెళ్లడంతో చంద్రగిరి బస్టాండ్, మార్కెట్ సంత ప్రాంతాల్లో వాహనాలు కదలలేని స్థాయికి చేరాయి. ఈ రద్దీలో అత్యవసర సేవలకూ తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. చంద్రగిరి ఏరియా ఆసుపత్రి నుండి తిరుపతి రూయా ఆసుపత్రికి వెళ్తున్న 108 అంబులెన్స్ సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. వాహనదారులు తక్షణమే మార్గం ఇవ్వకపోవడంతో పరిస్థితి క్లిష్టంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను పక్కకు తప్పించి అంబులెన్స్‌కు మార్గం సుగమం చేశారు. దీపావళి వేళ వాహనదారులు నియమాలు పాటించకపోవడం, అడ్డదిడ్డంగా రోడ్లపై నిలిపిన వాహనాలు వంటి కారణాలతో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఎదురయ్యాయని పోలీసులు తెలిపారు.

## ముక్కంటి సేవలో ప్రముఖులు

**శ్రీకాళహస్తిఅర్బన్, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కల్వకుంట్ల కవిత కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక రాహు కేతు పూజ అనంతరం కవిత కుటుంబ సమేతంగా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి వేద పండితుల ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపి ఈటెల రాజేంద్ర, ఎంపీ బలరాం, డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్ ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ అధికారులు వారికి తీర్థ ప్రసాదాలు, వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేసిన ఆయనకు





ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు దర్శనానంతరం వేదపండితుల ఆచార్యవసరం తీర్థప్రసాదాలను అందజేశారు కార్యక్రమంలో ఏఈఓ మోహన్ ఏపీఆర్ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ జూ పార్కులో బెంగాల్ వైట్ టైగర్ "సమీర్"మృతి

**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** స్థానిక శ్రీ వేంకటేశ్వర జూలాజికల్ పార్క్ నందు ఆదివారం రోజున వయసు మీరడంతో బెంగాల్ వైట్ టైగర్ "సమీర్" మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సి.సెల్వం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దాదాపు 19 సంవత్సరాల వయస్సున్న ఈ పెద్దపులి ఆదివారం తెల్లవారుఝామున చివరి శ్వాస విడిచినట్లు చెప్పారు. వృద్ధాప్యం సంబంధిత సమస్యల వలన ఏర్పడిన సమస్యల కారణంగా సమీర్ చాలా కాలం పాటు నిమగ్నమైన సంరక్షణలో ఉండేదన్నారు. శ్రీవేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం,పాథాలజీ విభాగం వైద్యుల బృందం నిర్వహించిన పోస్ట్-మార్టమ్ పరీక్షలో మూత్రపిండాల్లో నీటి నిల్వ (హైడ్రో నెఫ్రోసిస్), వృద్ధాప్యం కారణంగా మృతి చెందినట్లు తెలిసిందన్నారు. సమీర్ 2011లో, ఐదు సంవత్సరాల వయస్సులో హైదరాబాద్ లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ నుండి తిరుపతి జూలాజికల్ పార్కుకు తరలించబడినది. అప్పటినుంచి గత 14 సంవత్సరాలుగా జూ పార్కు నందు సందర్శకులకు ప్రియమైన నివాసిగా ఉండేది. కాలక్రమేణా, వయస్సు సంబంధిత ఆరోగ్య సమస్యలు వృద్ధి చెందడంతో అది తిరగదానికి కూడా కష్టపడేది అన్నారు. దీని కారణంగా, సమీర్ యొక్క శ్రేయస్సు కోసం, గత ఒక సంవత్సరం పాటు సందర్శకులకు ఈ పులిని ప్రదర్శనకు ఉంచలేదన్నారు. ఇటువంటి సమయంలో జూ వెటర్నరీ బృందం నిరంతరం దీనిపై సన్నిహితంగా నిఘా ఉంచింది. గత మూడు నెలలుగా సమీర్ యొక్క ఆరోగ్య స్థితి మరింత అధోగతికి వెళ్లడంతో, ఘన ఆహారం తీసుకోవడం మానివేసి, ద్రవ ఆహారంపై మాత్రమే ఆధారపడి ఉండేది.గత వారంగా ద్రవ ఆహారం తీసుకోవడం కూడా నిలిచిపోయి,పూర్తిగా కదలికలేని స్థితికి చేరుకుంది.జంతు సంరక్షణ మరియు వెటర్నరీ సిబ్బంది చేతనైన ప్రయత్నం చేసినప్పటికీ, చివరకు సమీర్ మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు.సమీర్ యొక్క చివరి రోజుల్లో దానికి రాత్రింబవళ్లు సంరక్షణ అందించిన నిష్ఠాగత వెటర్నరీ బృందం, జంతు పాలకులందరికీ శ్రీ వేంకటేశ్వర జూలాజికల్ పార్కు తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ : మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**తడ, మేజర్‌న్యూస్:** మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్ఆర్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలో చేపడుతున్నామని సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు, వైయస్సార్సీపి సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తడ మండలం పూడి, కారూరు పంచాయతీలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టేందుకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకి పార్టీ నాయకులు, కార్యకర్తలు సాదర స్వాగతం పలికారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈ కార్యక్రమం తడ సర్పంచ్ వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు కెలవి ఆర్ముగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ జిల్లా మండల, నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## ఆయిల్ ట్యాంకర్ లారీ, కారుకు తప్పిన భారీ పెను ప్రమాదం

**బంగారుపాళ్యం, మేజర్‌న్యూస్:** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాల్యం మండలంకు సంబంధించిన మహాసముద్రం టోల్ ప్లాజా ప్రక్కన సంక్రాంతిపల్లి గ్రామ సమీపంలో చిత్తూరు నుండి పలమనేరు వైపు వెళ్తున్న ఇండియన్ ఆయిల్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ లారీ, పలమనేరు వైపు నుంచి అతివేగంగా కారు డివైడర్ను ఢీకొని ట్యాంకర్‌ను ఢీకొనడంతో ట్యాంకర్ బోల్తా కారులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు. అయితే ట్యాంకర్‌లో పెట్రోల్, డీజిల్ రెండు రోడ్డుపైన పడిపోవడంతో ఏమాత్రం ఫైర్ అయినచో సంక్రాంతి పల్లి గ్రామంలో ఒక ఇల్లు కూడా మిగిలేది కాదని ప్రజలు పండగ పూట పెద్ద పెనుప్రమాదం తప్పిందని అంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది భారీ ఎత్తున చేరుకుని ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ ద్వారా సహాయ చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది పోలీసులు తెలియజేశారు.





## నేడు తుమ్మలగుంటలో నరకాసురవధ

### 20 అడుగుల ఎత్తు, రూ.2 లక్షల టపాకాయలు

### 10 మంది కార్మికులచే సిద్ధమవుతున్న నరకాసురుని ప్రతిమ

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** ప్రతి ఏటా నరక చతుర్దశి రోజున తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అత్యంత వైభవంగా నిర్వహించే నరకాసుర వధకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత మూడు రోజులుగా పది మంది కార్మికులు తయారు చేసిన నరకాసురుని ప్రతిమ అందరినీ ఆకట్టుకుంటోంది. 20 అడుగుల ఎత్తు, అందులో 2లక్షల టపాకాయలను అమర్చి ప్రత్యేకంగా తయారు చేశారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నరకచతుర్ధశి రోజున నరకాసుర వధను అత్యంత వేడుకగా నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ఆ బాధ్యతను పంచుకున్నారు. ఆలయం వద్ద జరిగే ఏ కార్యక్రమాన్ని వదిలిపెట్టకుండా నిర్విఘ్నంగా పూర్తి చేస్తున్నారు. ఇటీవల జరిగిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సైతం అత్యంత వేడుకగా పూర్తి చేయడమే అందుకు నిదర్శనం. తాజాగా సోమవారం సాయంత్రం జరిగే నరకాసురవధ కార్యక్రమానికి అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇప్పటికే బొమ్మ తయారీ పనులు పూర్తవడంతో ఆ పనులను ఆదివారం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పర్యవేక్షించారు. నరక చతుర్ధశి పర్వదినాన సోమవారం సాయత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే నరకాసుర వధను తిలకించడానికి తుమ్మలగుంట గ్రామస్తులతో పాటు తిరుపతి నగరం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివస్తారు. అలాగే చంద్రగిరి నియోజకవర్గం నుంచి కూడా జనం అక్కడకు చేరుకునే అవకాశం ఉన్నందున పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. నరకాసురవధ చేసే క్రమంలో నరకాసురుని ప్రతిమలో అమర్చియున్న టపాకాయలు పేలుతున్న క్రమంలో ఎవ్వరికీ అపాయం కలగుకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆలయ సిబ్బందికి సూచించారు.



## జిల్లా ప్రజలకు కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** దీపావళి పండుగ సందర్భంగా తిరుపతి జిల్లాలోని ప్రజలందరికీ పండుగ శుభాకాంక్షలను కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అంధకారంపై వెలుగు విజయం సాధించిన దీపావళి పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఐకమత్యం, సంతోషం నింపాలని ఆయన ఆకాంక్షించారు. మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞానదీపాలను వెలుగించుకోవాలనే తాత్వికతను దీపావళిపండుగ మనకు అందిస్తుందని ఆయన తన సందేశం లో పేర్కొన్నారు ఈ దీపావళి ప్రతి ఇంటికి వెలుగు మాత్రమే కాదు, ఆశ, అభివృద్ధి, సంక్షేమం కూడా తీసుకురావాలని, రైతులు, యువత, మహిళలు, వృద్ధులు, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు. చిన్న పిల్లలతో టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్త వహిస్తూ, తల్లిదండ్రులు లేదా పెద్ద వారి పర్యవేక్షణలో వారు ఉండేలా చూడాలని తెలిపారు. అధిక శబ్దం కలిగిన బాణసంచాను కాల్చేసమయంలో తోటివారికి ఇబ్బంది కలగకుండా బంధుమిత్రులు, కుటుంబ సభ్యులందరూ కలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఆనందాలను, సంతోషాలను, కొత్త కాంతులను తీసుకురావాలని, అలాగే దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని కలెక్టర్ జిల్లా ప్రజలకు సూచించారు.



## నియోజకవర్గ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ

**తడ, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ దీపావళి విజయానికి ప్రతీక అని కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల కష్టాలను తరిమేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలకు తిరుపతి జిల్లా, రాష్ట్ర ప్రజలందరికీ సూళ్లూరుపేట శాసనసభ్యులు డా.నెలవల విజయశ్రీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ దీపావళి విజయానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలందరి జీవితాల్లో కష్టాల చీకట్లు తొలగిపోయి సంతోషాల వెలుగులు ప్రసరించాలని ఆ దేవున్ని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు.టపాసుల వెలుగులతో, దీప కాంతుల జ్యోతులతో, సిరసంపద రాసులతో ఈ దీపావళి ప్రతి ఇంట సిరుల పంట కురిపించాలని కోరుకుంటున్నానన్నారు. అష్టలక్ష్ములు ప్రతి ఇంట్లో నెలవై సకల శుభాలను, ధైర్యాన్ని, స్థైర్యాన్ని, విజయాలను, సిరి సంపదలను, సుఖ సంతోషాలను ప్రసాదించాలని, తెలుగింటి లోగిళ్లన్నీ దీప కాంతులతో వెలుగులీనాలని, ఈ దీపావళి మీ జీవితంలో వెలుగులు నింపాలని, సరికొత్త వెలుగులతో ప్రజల జీవితాలు మరింత ప్రకాశించాలని ఆకాంక్షించారు.







# కరుగుతున్న గుట్టలు.. పట్టించుకోని అధికారులు

**రొంపిచెర్ల-మేజర్ న్యూస్:** రొంపిచెర్ల మండలం, చెంచమ రెడ్డి గారి పల్లి గ్రామపంచాయతీలో గుట్టలు అధికారుల కళ్ళ ముందరే కరిగి పోతున్న పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుసిరెడ్డిగారి పల్లికి పక్కన ఉన్న సర్వేనెంబర్ 51 లో ఉన్న గుట్టను కొందరు జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. నిత్యవసరాల కోసం కేటాయించిన గుట్టను నామరూపాలు లేకుండా చేస్తున్నారని తెలిపారు. గతంలో ఒకరికి ఒక ఎకరా భూమిని పట్టా ఇచ్చారని, దానిని మరొకరు కొనుగోలు చేసి ఎకరా భూమి చూపి మూడు ఎకరాల గుట్టను చదును చేస్తున్నారని అన్నారు. భూముల ధరలకు రెక్కలు రావడంతో గుట్టలను కూడా వదలడం లేదని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికే మూడు ఎకరాల గుట్టను చదును చేశారని అన్నారు. ఈ విషయం రెవిన్యూ అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వలన పశువులను, మేకలను, గొర్రెలను మేపుకునేందుకు గుట్టలు కూడా కనబడడం లేదని తెలిపారు. రెవిన్యూ అధికారులు వెంటనే అక్రమార్కుల నుంచి గుట్టలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. మండల రెవిన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు తెలిపారు.

## అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం:

### తహసిల్దార్ కిరణ్ కుమార్

గుట్టను ను చదును చేస్తున్న వారిని విచారించడం జరిగింది. జేసీబీ పనులను ఆపడం జరిగింది. రికార్డులు చూపి భూమిని చదును చేసుకోవాలని తెలపడం జరిగింది. బుసిరెడి గారి పల్లె పక్కన ఉన్న గుట్టను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. గతంలో ఏమైనా పట్టా ఇచ్చారా అని విచారణ చేశాం. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించిన వదిలే ప్రసక్తే లేదన్నారు.





### సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో

# కమిషనర్ మౌర్య

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ భాగంగా తగ్గింపు రేట్లపై నెల రోజులు పాటు అనేక కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందనీ, ప్రతి ఒక్కరికి జీఎస్టీ తగ్గింపు ఫలాల గురించి ఇంకా విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం కచ్చపీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న జీఎస్టీ అడిషనల్ కమిషనర్లు నాగేంద్ర, శర్మ , పర్యాటకశాఖ ఆర్ డి రమణ ప్రసాద్ తో కలిసి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ.. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ భాగంగా తగ్గింపు రేట్లపై నెల రోజులు పాటు అనేక కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. 18 శాతం నుంచి 5 శాతం 12 శాతం నుంచి 5 శాతం 28 నుంచి 18 శాతం వరకు తగ్గింపు అనేది ఉందని తెలిపారు. ప్రతిరోజు నిత్యం వాడే టూత్ పేస్ట్ నుంచి మిల్క్, బిస్కెట్స్, చాక్లెట్స్, జిమ్ ఐటమ్స్, వాహనాలు కలంకారీ మీద తగ్గింపు అనేది ఉందని అన్నారు. ఇవన్నీ కూడా ప్రజలకు తెలియాలని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా సందర్భంగా వాడే టపాకాయలు సంబంధించి పొల్యూషన్ తగ్గించడంలో భాగంగా గ్రీన్ టపాకాయలు ప్రతి ఒక్కరు వాడాలి. వాటి ధరలు చాలా వరకు తగ్గింపు ఉండేలా చూడాలని తెలిపారు. రూఫ్ టాప్ సోలార్ సిస్టంపై కూడా చాలా వరకు ధరలు తగ్గాయని దీనిపై కూడా అందరికీ తెలిసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. జీఎస్టి అడిషనల్ కమీషనర్లు మాట్లాడుతూ.. అనేక రకాలైన వస్తువుల, సేవల మీద పన్ను రేట్లను తగ్గించి దాని ద్వారా పొదుపు ను సాధించి ఆ పొదుపు ద్వారా ఇంకొక రకంగా పెట్టుబడి పెట్టి సంతృప్తికరమైన ఆర్థిక ప్రగతిని సాధించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఉన్నతమైన అంకితభావంతో లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో రకాల వస్తువులు సేవలపై పన్ను రేట్లను తగ్గించి దానికి సంబంధించినటువంటి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా ప్రయోజనాల నిమిత్తం జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో తిరుపతి జిల్లాలో అయిదు వేల జీఎస్టీ కార్యక్రమాలను జరుపుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ ప్రధాన భూమికా అన్ని శాఖల సమన్వయంతో గ్రామ మరియు సచివాలయ సిబ్బంది తో కలిసి ప్రతి ఇంటింటికి వెళ్లి జీఎస్టీ ఫలాలు ఏ విధంగా అందించాలి అనే విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు.

# చిత్తూరు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు..

### జిల్లా ఎస్పీ తుషార్ డూడి..



**చిత్తూరు (అక్టోబర్ 19), (క్రైమ్):** చిత్తూరు జిల్లా ప్రజలకు, మీడియా మిత్రులకు మరియు పోలీసు కుటుంబాలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "దీపావళి ప్రతి ఇంటికి సంతోషాలు, ఆనందాలు, ఆరోగ్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. వెలుగుల పండుగగా దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపి సుఖశాంతులను చేకూర్చాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. ఆనందం, శాంతి, సౌఖ్యంతో పండుగను జరుపుకోవాలని, భద్రతా నిబంధనలు పాటిస్తూ ఆత్మరక్షణతో సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని సూచించారు. పటాకులు ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా కాకుండా, శాంతియుతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. దీపావళి మన సంస్కృతి, కుటుంబ విలువలను పునరుద్ధరించే పండుగగా నిలుస్తుందని, సమాజంలో ప్రేమ, సౌహార్దతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పండుగ వేళ ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. టపాసులు పెద్దల పర్యవేక్షణలోనే వాడాలని సూచించారు. చిత్తూరు జిల్లా పోలీసులు ప్రజల భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో రాత్రి పహారాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి పండుగ వేళ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా 112 కు, లేదా జిల్లా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నంబర్ 9440900005 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ పండుగను సుఖసంతోషాల నడుమ, బాధ్యతతో, భద్రతా చైతన్యంతో జరుపుకోవాలని, ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు అని ఎస్పీ తుషార్ డూడి ఒక ప్రకటనలో తెలిపారు.




### వన్ నేషన్-వన్ ట్యాక్స్ అమలు అనేది

# చారిత్రాత్మక నిర్ణయం

### ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్



**చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్:** భారతదేశంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి ప్రజలకు మేలు కలిగించే పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, అందులో వన్ నేషన్ - వన్ ట్యాక్స్ అమలు అనేది చారిత్రాత్మక నిర్ణయమని చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్ తెలిపారు. ఆదివారం సూపర్ జీఎస్టీ- సూపర్ తగ్గింపు జిల్లాలోని అన్ని శాఖల ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే భవన్ , స్టాల్స్ ను స్థానిక ఎమ్మెల్యే పరిశీలించారు ఈ కార్యక్రమంలో, నగర మేయర్ ఆముద, జీడి నెల్లూరు ఎమ్మెల్యే థామస్, చూడ చైర్మన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిఆర్ఓ మోహన్ కుమార్, జిల్లా అధికారులు, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు, సుమారు 36 స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. అనంతరం ముగింపు సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ మరియు జీడీ నెల్లూరు శాసనసభ్యులు థామస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జి ఎస్ టి 2.0 ద్వారా పన్నులను తగ్గించడం జరిగిందని, పన్నుల విధానంలో సంస్కరణల తీసుకురావడం ద్వారా రాష్ట్రానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆదాయం తగ్గుతుందని అన్నారు. ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా పేద మధ్య తరగతి వారికి మేలు జరుగుతుందన్న కారణంగా దేశంలో మొదటిసారిగా రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అసెంబ్లీ సాక్షిగా మద్దతు తెలిపిందన్నారు. జి ఎస్ టి 2.0 ద్వారా కలిగే మేలు పై ప్రజలకు అవగాహన కలిగించేలా నెల రోజులగా విస్తృతంగా సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమ ముగింపు సభ నిర్వహించుకున్నామన్నారు. జి ఎస్ టి 2.0 ద్వారా క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల మందుల పై జి ఎస్ టి ను పూర్తిగా తొలగించడంతో వైద్య ఖర్చు తగ్గుతుందన్నారు. వీటితో పాటు నిత్యావసర వస్తువైనా కాయగూరల పై జి ఎస్ టి సున్నా చేశారన్నారు. ఇలా జి ఎస్ టి 2.0 ద్వారా పేద మధ్య తరగతి ప్రజలకు నెలవారీ ఖర్చు తగ్గుతాయన్నారు. ధరలు తగ్గితే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, తద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతోఉపాధిఅవకాశాలు పెరుగుతాయన్నారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ఊతం ఇవ్వడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా యువతకు ఎం ఎస్ ఎం ఈ ద్వారా రుణ సౌకర్యం కలిగించడం జరుగుతుందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశీయ వస్తువులకు గిరాకీ ఎక్కువ అవుతుందన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే గురుజాల జగన్ మోహన్ మాట్లాడుతూఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి ప్రజలకు మేలు కలిగించే పలు కార్యక్రమాలు అమలు చేయుచున్నదని తెలిపారువన్ నేషన్ - వన్ ట్యాక్స్ అమలు అనేది చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. ప్రజలకు మేలు చేయాలని తపన ఉండే ఎన్డీఏ ప్రభుత్వం అందించిన ఫలాలకు ఒక గొప్ప ఉదాహరణ జీఎస్టీ 2.ఓ అమలు అని తెలిపారు. పేదలకు ఉపయోగపడే అన్ని రకాల వస్తువుల పై జీఎస్టీ తగ్గించామని,జిఎస్టి తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వం 8 వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతున్నప్పటికీ ప్రజల సంక్షేమం దృష్టిపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అంగీకరించిందన్నారు. ప్రతి కుటుంబానికి దాదాపు సంవత్సరానికి 18 నుండి 20 వేలు ఆదా అయ్యేలా సూపర్ జీఎస్టీ 2. ఓ అమలు ద్వారా మేలు కలుగుతోందని అన్నారు. అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ ఆలోచనల మేరకు జిల్లాలో నాలుగు వారాలపాటు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని, జిల్లాస్థాయి, నియోజకవర్గస్థాయి, మండల స్థాయి విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి జిఎస్టి తగ్గింపు పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు, వ్యవసాయ ఉత్పత్తి, వైద్య రంగం, పౌల్ట్రీ రంగం, సంబంధించిన ప్రజలకు సూచిక బోర్డుల ద్వారా తగ్గింపు ధరలు అవగాహన నిర్వహించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారి రఘునాథరెడ్డిటిడిపి పార్టీ జిల్లా అధ్యక్షుడు సి ఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్ యాదవ్, ఆర్డీవో శ్రీనివాసులు, చిత్తూరు తహశీల్దార్, కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ కమిషనర్లు, జిల్లా అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్న విజయ నాయుడు

**కార్వేటినగరం (మేజర్‌న్యూస్):** కార్వేటినగరం కుమారగిరిపై వెలసిన శ్రీవల్లి దేవయాన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. ఈ విశేష పూజకు తిరుపతి నుండి కార్వేటినగరం వాస్తవ్యులు తోట విజయులునాయుడు కుమారులు తోట విజయ్‌కుమార్ నాయుడు, వారి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎంతో ప్రాశస్త్యం పొందిన ఈ ఆలయ దర్శనం భక్తులకు ఎంతో ఆనందాన్ని, శుభప్రదం కలిగిస్తుందని, ఆరోగ్య ప్రదాతగా వెలసిన స్కంధ మురుగన్ కోవెల ఎంతోమందికి ఆరోగ్యాన్ని ఐశ్వర్యాన్ని కల్పించి, చిన్న తిరుత్తణిగా కార్వేటినగరంలో వెలిసి ఉన్న స్వామివారికి పేరు ఉందన్నారు. తమ పూర్వీకులను నుండి స్వామివారిని కొలుస్తున్నామని, సుబ్రహ్మణ్యంస్వామి వారి దేవస్థానం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని, రాబోవు కృత్తికకు స్వామివారి దర్శనార్థం తన కుటుంబ సభ్యులతో హాజరవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు రామ్‌శెట్టి, రాజశేఖర్ పాల్గొన్నారు.



## అనుమతి లేకుండా టపాకాయలు విక్రయిస్తే చర్యలు తప్పవు

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** టపాకాయల విక్రయాలకు ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా టపాకాయల విక్రయిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకటనరసింహ అన్నారు. పెనుమూరు మండలంలోని సాతంబాకం గ్రామానికి చెందిన ఎన్.జయరామిరెడ్డి కుమారుడు కేశవరెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా టపాకాయలను విక్రయిస్తున్నట్లు సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి రూ.42,220 విలువగల టపాకాయలను స్వాధీనపరుచుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలికి భగవద్గీత అందజేసిన వైకాపా నేత

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల దర్శనానికి ఆదివారం విచ్చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం శ్రీకృష్ణ చారిటబుల్‌ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దంపతులకు కలంకారి వస్త్రంతో సత్కరించి భగవద్గీతను అందజేశారు. కల్వకుంట్ల కవిత భగవద్గీతను అందుకొని ఎంతో ఆనందాన్ని వ్యక్తపరిచారు.



## ప్రభావతమ్మకు మాజీ ఎమ్మెల్యే శ్రద్ధాంజలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి కైలాసగిరి కాలనీలో వైయస్సార్సీపి నియోజకవర్గం యువత అధ్యక్షులు సూరాసురేష్ పిన్నమ్మ ఆర్.ప్రభావతమ్మ అనారోగ్యంతో మరణించారు. వారి పార్థివ దేహానికి శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియచేసారు. ఈ కార్యక్రమంలో లీల కుమార్, పటాన్ ఫరీద్, కంట ఉదయ్ కుమార్,ఆవుల శ్రీనివాసులు, కన్నా, బాలా గౌడ్, సంతాపం తెలియజేశారు.



## కొండకిందపల్లిలో వైభవంగా జల్లికట్టు

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** దీపావళి పండుగను పురస్కరించుకొని వెదురుకుప్పం మండలం కొండకిందపల్లి గ్రామంలో ఆదివారం జల్లికట్టు అత్యంత వైభవంగా జరిగింది. జల్లికట్టుకు చుట్టుపక్క గ్రామాల నుండి పశువులను తీసుకువచ్చి అలంకరించారు. కోడేగిత్తల కొమ్ములకు రంగులు పూశారు. వాటి కొమ్ములకు వివిధ ఆకృతలతో కూడిన కొయ్య పలకలను కట్టారు. మరి కొన్నిటికి బహుమతులను ప్రకటించారు. గ్రామమధ్యలో అల్లెను ఏర్పాటు చేశారు. అల్లే నుండి కోడెగిత్తలను జనం పైకి పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ వదిలారు. జన సమూహాన్ని చూసిన కోడెగిత్తలు పౌరుషంతో జనం పైకి దూసుకువెళ్లాయి. గిత్తలను నిలువరించడానికి యువకులు పోటీలు పడ్డారు. కోడెగిత్తల తాకిడికి యువకులు నిలువరించే ప్రయత్నంలో కిందపడి కొంతమంది గాయపడ్డారు. కొన్ని గిత్తలు యువకుల చేతికి చిక్కి బిక్కుమన్నాయి. పోటీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొట్టారు. మరికొన్ని కోడె గిత్తలు యువకుల చేతికి చిక్కకుండా పరుగులు తీసాయి. జల్లికట్టును వీక్షించడానికి జనం కొండకిందపల్లికి చేరు కోవ దంతో కొండ కింద పల్లి గ్రామం జనసంద్రంగా మారింది.



## ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించండి :ఎమ్మెల్యే థామస్

**కార్వేటినగరం (మేజర్‌న్యూస్):** గంగాధర్ నెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమ్మరాజు పల్లి గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం. థామస్ మండల అధికారులు సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి సమస్యను ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారు వాటి వివరాలను చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.





## కృష్ణాపురం జలాశయం గేట్లు ద్వారా నీరు విడుదల

**కార్వేటినగరం (మేజర్‌న్యూస్):** కార్వేటి నగరం మండలం అమ్మపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కృష్ణాపురం జలాశయం రిజర్వాయర్లు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటిమట్టం పెరగడంతో రాత్రి 10 గంటలకు పైన గేట్లు ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారి ఏఈ భాస్కర్ రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గేట్లు ఎత్తే సమయంలో పరిసర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు ఇటు తమిళనాడు పోలీసులు ఆంధ్ర పోలీసులు సరిహద్దు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిఐ హనుమంతప్ప, ఎస్సై రమేష్ నాయక్ తెలిపారు.

## మురళికి దామోదర్ రెడ్డి శ్రద్ధాంజలి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** కాంగ్రెస్ పార్టీ నాయకులు కుడిచేటి మురళి పార్థివ దేహానికి కాంగ్రెస్ నేత తలపా దామోదరం రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం శ్రద్ధాంజలి ఘటించారు. కుడిచేటి మురళి మరణవార్త విన్న వెంటనే వారి పార్థివ దేహం వద్దకు చేరుకుని వారికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో తిరుపతి జిల్లా యువజన అధ్యక్షులు సీతారాం, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.



## సీడ్ బాల్స్‌ను అటవీ ప్రాంతంలో వెదజల్లితే మరెన్నో వృక్షాలు పెరిగి పర్యావరణాన్ని కాపాడుతుంది

**కుప్పం, మేజర్‌న్యూస్:** లయన్స్‌క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ శాంతిపురం సర్వింగ్ హ్యాండ్‌చే ఫారెస్ట్ అధికారులకు విత్తన బంతులు (సీడ్ బాల్స్) పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 317 ఇ తరపున పెర్మనెంట్ ప్రాజెక్ట్ పర్యావరణ పరిరక్షణ భాగంగా సీడ్ బాల్స్ లయన్స్ క్లబ్ ఆఫ్ సదుం వారు తయారుచేస్తారు. దీనిని డిస్ట్రిక్ట్ క్లబ్ అందరికీ పంపిణీ చేస్తారు. అదేవిధంగా లయన్స్ క్లబ్ కుప్పం వారియర్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ శాంతిపురం సర్వింగ్ హ్యాండ్ కు 20,000 సీడ్ బాల్స్ పంపిణీ చేశారు. సీడ్ బాల్స్‌ను కుప్పం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జయశంకర్, అటవీ శాఖ అధికారులకు అందించడం జరిగింది. మంచి వర్షం పడుతుంది కావున సీడ్ బాల్స్ ను అటవీ ప్రాంతంలో వెదజల్లితే మరెన్నో వృక్షాలు పెరిగి పర్యావరణాన్ని కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ జయశంకర్, అటవీ శాఖ అధికారులు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్పర్సన్ ఫర్ యూత్ స్పోర్ట్స్ మహేష్, సభ్యులు సెల్వం, ప్రసాద్, జయరామ్ నాయుడు, సతీష్, లయన్స్ క్లబ్ శాంతిపురం సభ్యులు బాబు, సుధాకర్ పాల్గొన్నారు.




## సమ్మె అనంతరం పవర్ జేఏసీ బహిరంగ లేఖను విడుదల

**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** విద్యుత్ రంగంలో ఇటీవల జరిగిన పవర్ జేఏసీ సమ్మె తర్వాత ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిఈసిఈఎ) 3045 యూనియన్ బహిరంగ లేఖ విడుదల చేసింది. యూనియన్ ప్రెసిడెంట్, కాశీ మధుబాబు, జనరల్ సెక్రెటరీ ప్రేమ్ కుమార్ లేఖలో సమ్మె అనంతరం కార్మికుల నుంచి వచ్చిన విమర్శలు, వ్యాఖ్యలు కార్మిక ఐక్యతకు హానికరంగా ఉన్నందున వాటిని ఖండిస్తూ, అనవసరమైన విమర్శలు చేయవద్దని స్పష్టం చేసింది. యూనియన్ ప్రస్తావించినట్లుగా, కాంట్రాక్ట్ కార్మికులు రెగ్యులరైజేషన్ సాధించడానికి సుదీర్ఘ పోరాటం మాత్రమే మార్గం అని విశ్వసిస్తున్నారు. అదే సమయంలో, రెగ్యులర్ ఉద్యోగ సంఘాలు డిమాండ్‌ల సాధనలో కార్మిక శక్తిని ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు. లేఖలో కాంట్రాక్ట్ కార్మికుల భవిష్యత్తు ప్రయోజనాలు, ముఖ్య డిమాండ్లను గుర్తించి, మినిట్స్‌లో కొంత ఊరట లభించినట్టు తెలిపా రు. రాబోయే రోజుల్లో కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగ సంఘాలు,ఇంజనీర్స్ అసోసియేషన్లతో ఐక్యత కాపాడు తూ డిమాండ్ల సాధనలో ముందడుగు వేయాల్సిన అవసరం ఉందని యూనియన్ భావి స్తోందని తెలిపారు. ఎపిఈసిఈఎ జి3045 యూనియన్ స్వతంత్ర సంఘంగా కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే పనిచేస్తుందని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం యూనియన్ ఎప్పుడూ పనిచేయదని లేఖలో స్పష్టం చేశారు. యూనియన్ ముఖ్య లక్ష్యం విద్యుత్ సంస్థల్లో 3పార్టీ కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేసి, విలీనం (రెగ్యులరైజేషన్) సాధించడం అని వెల్లడించారు. ఎపిఈసిఈఎ జి3045 యూనియన్ తెలిపిన ప్రకారం,ఎన్ని అడ్డంకులు ఎదురైనా యూనియన్ ఎల్లప్పుడూ ఐక్య పోరాటానికి సిద్ధంగా ఉంటుందని 3045 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సుధాకర్ హెచ్చరించారు.



# శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కుటుంబ సభ్యులు

## స్వాగతం పలికిన శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** తెలంగాణ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షు



రాలు కల్వకుంట్ల కవిత కుటుంబ సభ్యులు ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూర తారక శ్రీనివాసులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు దక్షిణ గోపురం వద్ద



స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక రాహు కేతు పూజ, స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పగడాల రాజు, కంటా ఉదయ్ కుమార్, ఏర్పేడు మండల ఇంచార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, మున్నా రాయల్, యువజన విభాగం అధ్యక్షుడు మునికృష్ణ రెడ్డి,ఏర్పేడు మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పటాన్ ఫరీద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ పసల కృష్ణయ్య, తూకివాకం సర్పంచ్ ముని, శివ కుమార్ యాదవ్, పులి రామచంద్ర,టైలర్స్ శ్రీను, సాగిరాభి, షర్మిల ఠాగూర్, పెరుమాల చౌదరి, అస్లాం, వెంకటేశ్వర్లు నాయుడు, ఫజల్, భాను, అప్పిని సుధాకర్, నారాయణ, జీవిక రెడ్డి,జై కృష్ణారెడ్డి, సతీష్, సూర్య, దినేష్, యాకూబ్, శ్యామ్ పాల్గొన్నారు.






# నగర ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్ మౌర్య

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగర ప్రజలకు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బందికి కమిషనర్ ఎన్.మౌర్య దీపావళి శుభాకాంక్షలు తెలియజేసారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి పండుగ ప్రతీకని, దీపావళి పండుగ ప్రజలందరి జీవితాలలో వెలుగులు, సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. పండగ వేళలో బాణాసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణహిత టపాసులు వినియోగించాలని కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు

నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116


# అల్లంపాడులో మెడికల్ కళాశాలల ప్రైవేటుకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం

**కోట, మేజర్‌న్యూస్:** కోట మండలం వంజివాక అల్లంపాడు పుచ్చలపల్లిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణురచ్చబండ కార్యక్రమానికి విచ్చేసిన మేరిగా మురళీధర్, సిఈసి సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి గూడూరు నియోజకవర్గ పరిశీలకులు బీరేంద్ర వర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పేర్నాటి శాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్ర రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీకి అనుమతులు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థను వైద్య వ్యవస్థను పూర్తిగా నామరూపాలు లేకుండా నాశనం చేస్తున్నారన్నారు. పేద కుటుంబాల నుంచి వైద్య విద్య చదువుకోవాలన్న పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈరోజు వైద్య విద్య ప్రైవేటుపరం చేస్తే పేద విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. బిరేంద్ర వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలను చెప్పి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని ప్రజలను మోసం చేశారన్నారు. ఈరోజు గమనిస్తే రాష్ట్రంలో అన్ని విధాల రైతులు విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నట్లు గుర్తు చేశారు. గ్రామీణ ప్రజలకు కూడా ఈ ఒకటిన్నర సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. పల్లెల్లో కూడా ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది అన్నారు. శాసన మండల సభ్యులు మేరిగ మురళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్షపూరితమైన మోసపూరితమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి తనయుడిగా




మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నీతివంతమైన రాజకీయం చేశారన్నారు. ఐదు సంవత్సరాల పరిపాలనలో రెండు సంవత్సరాల్లో కరోనాకు పోయినప్పటికీ అనుక్షణం ప్రజల అభివృద్ధి కొరకు జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు కష్టపడి పని చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. కాని విని ఎరుగని రీతిలో నాడు నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. పేద విద్యార్థుల జీవితాల ఆనందం నింపారన్నారు.

ముఖ్యంగా రాబోవు రోజుల్లో కార్యకర్తల మాటే జగన్మోహన్ రెడ్డి బాటగా నడుచుకుంటారని తెలియజేశారు. దువ్వూరు రమణారెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతుల సంతోషంగా వ్యవసాయం చేశారన్నారు. ఆనాడు గిట్టుబాటు ధర 24 వేల రూపాయలు ఉంటే నేడు కూటమి ప్రభుత్వంలో ఒక పుట్టి 15 వేల రూపాయలకు చేరిందన్నారు. ఆరోజు ఉన్నటువంటి ధరలు ఈరోజు ఎందుకు లేవని ప్రశ్నించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా నిలబడి, గిట్టుబాటు ధర కోసం పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోట మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డిగారు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి, సూళ్లూరు పేట గూడూరు నియోజకవర్గాల పరిశీలకులు బీరేంద్ర వర్మ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి, జడ్పిటిసి కోటయ్య, మాజీ జెడ్పిటిసి ప్రసాద్ గౌడ్, దువ్వూరు రమణారెడ్డి, ఎరటపల్లి మధుసూదన్ రెడ్డి, కోట మండల ప్రధాన కార్యదర్శి పాముల సురేంద్ర , అల్లంపాడు సర్పంచ్ పోచరెడ్డి ఈశ్వర రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులు రెడ్డి, కోట మండలం మహిళా నాయకురాలు షేక్ రేష్మ , చిల్లకూరు మండలం మహిళా నాయకురాలు పర్వతాల లలితారెడ్డి, పాదర్తి మధురెడ్డి, దేవరాల రాం బాబు, సుధాకర్ రెడ్డి, కోట మండల ఉపాధ్యక్షుడు వాటం భేటీ సుబ్రహ్మణ్యం, కోదండ రెడ్డి, వెంకురెడ్డి, పుట్ట ధనశేఖర్, చింతల శ్రీనివాసులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో చిత్తూరు జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.

**పూతలపట్టు నియోజకవర్గం :**
1.పూతలపట్టు

**కుప్పం నియోజకవర్గం :**
1. రామకుప్పం.

**పలమనేరు నియోజకవర్గం :**
1.గంగవరం, 2.బైరెడ్డిపల్లి

**గంగాధర నెల్లూరు నియోజకవర్గం :**
1.గంగాధర నెల్లూరు

**సూళ్లూరుపేట నియోజకవర్గం :**
1.నాయుడుపేట

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

## పోలీస్ స్టేషన్‌లో ఘనంగా ఆయుధపూజ

### పోలీసులు జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ

**రేణిగుంట, మేజర్ న్యూస్:** రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నందు దీపావళి ఆయుధ పూజలను డీఎస్పీ శ్రీనివాసరావు సమక్షంలో సీఐ జయచంద్ర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ లోని వాహనాలకు పూజలు నిర్వహించి పోలీసులు, జర్నలిస్టులకు అడిషనల్ ఎస్పీ హెల్మెట్లను అందజేశారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహర్ ఆచారి మాట్లాడుతూ ద్విచక్రహోలు నడిపేటప్పుడు కచ్చితంగా హెల్మెట్లు ధరించాలని తెలిపారు. పోలీసులు హెల్మెట్లు ధరిస్తూ ప్రజలకు తెలియజేయాలని కోరారు. హెల్మెట్లు ధరించడం వల్ల తమ ప్రాణాలను కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, స్టేషన్ రైటర్ చలపతి, రేణిగుంట పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




## చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి

### నేడు దీపావళి




**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటారు. హిందూ క్యాలెండర్ ప్రకారం, ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసం కృష్ణపక్ష అమావాస్య నాడు దీపావళి జరుపుకుంటారు. పురాణ కథనం ప్రకారం.. భూదేవి, వరహా స్వామికి అసుర సమయంలో జన్మించిన నరకాసురుడు శ్రీహరి చేతిలో చావులేని విధంగా తల్లి చేతిలోనే మరణించేలా వరం పొందుతాడు. వరగర్వంతో లోకకంటకుడిగా తయారైన నరకుడు ముల్లోకాలను పట్టిపీడించాడు. నరకాసురుడి బాధలు భరించలేని దేవతలు, మునులు, గంధర్వులు శ్రీహరికి తమ గోడు వెళ్లబోసు కున్నారు. వారి మొర ఆలకించిన శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో కృష్ణుడిగా అవతరించి సత్యభామతో నరకాసురుని సంహరింప జేశాడు. నరకాసుర సంహారంతో అందరూ అనందంగా పండుగ చేసుకున్నారు. చతుర్దశి నాడు నరకుడి మరణించగా, ఆ తర్వాత రోజు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. దీపావళి అంటే దీపాల వరుస అన్ని అర్థం. నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపు కుంటారు. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమవాస్య కావడంతో, చీకటిని పారద్రోలుతూ ప్రజల దీపాలతో తోరణాలు వెలిగించి, బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది. లంకలో రావణుడిని సంహరించి, శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సంద ర్భంగా ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకు న్నారని మరొక పురాణం చెబుతోంది. దీపావళి చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. దీపావళికి ముందు ఇంటిని శుభ్రం చేసుకుని, రంగురంగుల రంగోళీలు వేసి, దీపాలు వెలిగిస్తారు. ఈ పండుగ దీపాల వెలుగుతో ప్రారంభమవుతుంది. దీపం బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ప్రతీకగా, అలాగే లక్ష్మీదేవి స్వరూపంగా భావించబడుతుంది. ఇళ్ల, దేవాలయాలు, మఠాలు, గోశాలలు, వీధులు – అన్ని చోట్ల దీపాలు వెలిగించాలన్న శాస్త్రాల సూచన ఉంది. దీపాలు వెలిగించడం, లక్ష్మీదేవి పూజ చేయడం, కొత్త బట్టలు ధరించడం, రకరకాల వంటలు వండటం, మరియు కుటుంబ సభ్యులు మరియు స్నేహితులతో కలిసి సంతోషంగా గడపడం వంటివి దీపావళిలో ముఖ్యమైనవి. లక్ష్మీదేవి రాత్రి సమయంలో భూమిపై తిరుగుతుందనే నమ్మకంతో దీపావళి రోజన లక్ష్మీదేవిని పూజిస్తారు. రకరకాల స్వీట్లు, రుచికరమైన వంటలు తయారు చేసుకుంటారు.

## తిరుచానూరు ఆలయ పవిత్రతను కాపాడండి

### పోలీసులు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది తీరు మారాలి
### హిందూ జర్నలిస్టు ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు మునిరామ్ రెడ్డి

**తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్:** గత కొంతకాలంగా తిరుచానూరు అమ్మవారి ఆలయంలోని అధికారులు,



విజిలెన్స్ సిబ్బంది, తిరుచానూరు పోలీసులు భక్తుల పట్ల మర్యాద లేకుండా ప్రవర్తిస్తూ దాడులకు పాల్పడడం చాలా దారుణమని సీనియర్ జర్నలిస్ట్,హిందూ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు మునిరామ్ రెడ్డి తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల శ్రీవారి భక్తులు ప్రతిరోజూ తిరుచా నూరును సందర్శిస్తారని, ఇక్కడ జరిగే చిన్న ఘటన కూడా సోషల్ మీడియాలో నిమిషాల్లో ప్రపంచవ్యాప్త మవుతుందని, తిరుపతి ప్రతిష్టకు మచ్చ తగలకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నెల10న మహతీ ఆడిటోరియంలో బ్రహ్మోత్సవాలు విజయవంతం గా ముగిసినందుకు జరిగిన సమావేశంలో టిటిడి ఈవో, జిల్లా ఎస్పీ సహా ఉన్నతాధికారులు అన్ని విభాగాలు సమర్థంగా పనిచేశాయని ,మీడియా పాత్ర కూడా కీలకం అని. మీడియా ప్రతినిధులు కూడా ఏవైనా సలహా సూచనలు చేయాలని కోరగా,తాను తిరుమలతోపాటు తిరుచానూరులో కూడా గతంలో బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తుల పట్ల విజిలెన్స్,పోలీస్ సిబ్బంది దురుసుగా,అసభ్య ప్రవర్తన గురించి గుర్తు చేయడంతో, స్పందించిన ఈవో ఎలాంటివి జరగకుండా చూస్తామని, హామీ ఇచ్చిన తర్వాత మూడు రోజుల్లోనే అమ్మవారి ఆలయంలో మహిళా జమేదార్ ఓ భక్తురాలిపై దాడి చేయడం జరిగిందన్నారు. 4 వ రోజు తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో కూడా ఏకంగా బెదిరించి దాడిచేసే వరకు ప్రయత్నం చేశారు. తిరుచానూరు సి.ఐ ఒక స్థానిక కూటమి నాయకుడిని, మీడియా ప్రతినిధిని అవమాన కరంగా దూషించారని, సీసీ కెమెరాల్లో మొత్తం రికార్డ్ అవుతుందని. తాను ప్రశ్నించగా "నీ వల్లయింది చేసుకో, రాసుకో" అంటూ సి.ఐ దురుసుగా ప్రవర్తించాడని ,ఒక సామాన్య ప్రజల పరిస్తితి ఏమిటో మీరు అర్థం చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అంటే కాకుండా గత కొన్నాళ్ల ముందు ఈ సి.ఐ అన్యమతస్తుడు కావడంతో ఆలయ ధ్వంసాలకు సహకరిస్తున్నాడని, ఆస్ట్రేలియా నుంచి ఓ ఎన్ఆర్ఐ జనసేన నాయకుడు ఈ సి ఐ భూ కబ్జాలకు చేస్తున్నాడని..వీడియో విడుదల చేశారని ఇవన్నీ వైరల్ కావడం మీడియా మిత్రులు మీరు చూసారు కదా, ఇలాంటి ఎన్నో ఆరోపణున్న ఈ అధికారిని ప్రజలు అంగీకరించడం లేదని,రాజకీయ అండతో ఇక్కడ కొనసాగుతున్నారని, వెంటనే ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మునిరామ్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో అమ్మవారి ఆలయంలో కూడా ఒక సూపరింటెండెంట్ ఓ భక్తురాలిపై అసభ్యకారంగా ప్రవర్తిస్తే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తినా.. వివిధ పత్రికలు,హిందూ సంఘాలు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు, కాబట్టే అధికారులు,సిబ్బందికి భక్తుల పట్ల,ప్రజల పట్ల భయం,భక్తి లేకుండా మితిమీరి ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే ఇలాంటివి పునరావృతం కాకుండా తిరుచానూరు పవిత్రత కాపాడాలని, సిఐ తనపై కక్షకట్టి ఇబ్బందులు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని, తాను ప్రాణహానికి గురయ్యే అవకాశం ఉందని, త్వరలో టిటిడి ఈవో, జిల్లా ఎస్పీ,అవసరమైతే హిందూ సంఘాలతో కలిసి ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేస్తానని, పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమని మునిరామ్ రెడ్డి హెచ్చరించారు.